సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 19 । మార్చి । 2025



గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సాగు చేసినా, సేవించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 9లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధవారం : 6:23	గురువారం : 5:04

గరిష్టం/కనిష్టం
39.0/26.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

22న జాబ్‌మేళా

ఆదిలాబాద్‌టౌన్: వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌లో లైన్ అసెంబ్లింగ్ అసిస్టెంట్ ఆపరేటర్ల నియామకానికి ఈనెల 22న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి మిల్కా ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి రూ.13,652 నుంచి రూ.15,662 వేతనం, ఇతర అలవెన్సులు ఉంటాయని పేర్కొన్నారు. 18నుంచి 28 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9989106661, 9494305417 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'కవిత పోరాటంతోనే బిల్లు'

ఆదిలాబాద్‌టౌన్: ఎమ్మెల్సీ కవిత పోరాటంతోనే బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచడానికి రెండు వేర్వేరు బిల్లులను ప్రభుత్వం పెట్టిందని జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ కులగణన విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలకు అన్యాయం చేయాలని చూశాయని ఆరోపించారు. ఆయన వెంట నాయకులు సాయికృష్ణ, ప్రమోద్, కార్తిక్, శ్రీనివాస్, డేవిడ్ తదితరులున్నారు.

నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న కన్వీనర్ మల్లేశ్

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ సమావేశాల్లో సీసీఐ పునఃప్రారంభానికి నిధులు కేటాయించాలని సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు సీసీఐ పునఃప్రారంభానికి ప్రయత్నించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. దీనిపై కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. కమిటీ కోకన్వీనర్లు విజ్జగిరి నారాయణ, వెంకట్ నారాయణ, లంక రాఘవులు, అరుణ్‌కుమార్, లోకారి పోశెట్టి, జగన్‌సింగ్, ఈశ్వరిదాస్, ఆర్.రమేశ్, అగ్గిమల్ల గణేశ్ తదితరులున్నారు.

స్కూళ్లలో స్కౌట్ యూనిట్లు



మాట్లాడుతున్న డీఈవో ప్రణిత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని డీఈవో ప్రణిత తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రగతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ అవగాహన శిబిరానికి హాజరై మాట్లాడారు. దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించే స్కౌట్ ఉద్యమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని స్కౌట్ అండ్ గైడ్స్ కార్యాలయ క్యాంపు సైట్ ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు వకుళాభరణం ఆదినాథ్, కాంచనవల్లి రత్నాకర్, కార్యదర్శి ఎన్.స్వామి, కోశాధికారి కన్నం మోహన్‌బాబు, సంయుక్త కార్యదర్శి లక్ష్మి, శిక్షణ కమిషనర్ నాగిరెడ్డి, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు దత్తు, లక్ష్మి, జీవిత తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న 'ఆశ'లు

ఆదిలాబాద్‌టౌన్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశ కార్యకర్తల సమస్యలపై చర్చించి పరిష్కరించేలా చూడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.18వేల వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఏఎస్ఎం శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రమోషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5లక్షలు చెల్లించాలని కోరారు. తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సుజాత, లత, ఆశ, అనిత తదితరులున్నారు.

కరుణించేనా?



- నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న 'భట్టి' • గతేడాది కేటాయింపులు అంతంతే
- ఈ బడ్జెట్‌పైనే జిల్లావాసుల ఆశలు • ప్రతిపాదనలు పంపిన ఎమ్మెల్యేలు
- జిల్లాపై వరాల జల్లు కురిపించేనా?

సాక్షి, ఆదిలాబాద్: కాంగ్రెస్ సర్కారు బుధవారం అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఈ పద్దు చదవనున్నారు. బడ్జెట్‌లో జిల్లాకు ఒనగూరే చర్యలు ఏవైన ఉంటాయా.. అని జిల్లా ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. గతేడాది బడ్జెట్‌లో నామమాత్రంగా జిల్లాకు కేటాయింపులు జరిగినా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో నేటి బడ్జెట్‌లో జిల్లాకు స్వాంతన లభించేలా కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి చేయూత ఉంటుందో.. లేదో చూడాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా ఏళ్లగా ఎన్నో ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటికి నిధులు కేటాయిస్తారా.. అనేది చూడాల్సిందే. కొన్ని ప్రాజెక్ట్‌లు అసంపూర్తిగా ఉండగా, మరికొన్ని ప్రారంభించాల్సి ఉంది. రహదారులు, బ్రిడ్జీల నిర్మాణంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. విద్య, వైద్య రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు ఉంటాయో చూడాల్సిందే.

వీటిపై ముందడుగు పడేనా?

- తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో జైనథ్ మండలం కొరట గ్రామం వద్ద సరిహద్దు మహారాష్ట్రలోని చనాక మధ్యలో పెన్‌గంగా నదిపై ఇదివరకే బ్యారేజ్ నిర్మించారు. దీనికి సంబంధించి పంప్‌హౌస్, ఎల్‌పీపీ కెనాల్ పనులు కూడా పూర్తయ్యాయి. నీటి ఎత్తిపోతలకు సంబంధించి ప్రయోగాత్మకంగా డ్రైరన్, వెట్‌రన్ కూడా నిర్వహించారు. ఇక ప్రధాన కెనాల్ నుంచి కాలువలు, ఉప కాలువల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి సంబంధించి భూసేకరణతో పాటు నిర్మాణానికి సంబంధించి మరో రూ.250 కోట్లు అవసరమున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పనులు పూర్తయితే ఎల్‌పీపీ కాలువ ద్వారా 37,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే పరిస్థితి ఉంటుంది. పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణం కోసం మరో వెయ్యి ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. దీని నుంచి కొరాట–చనాకా కెనాల్ నిర్మించాల్సి ఉంది. తద్వారా లక్ష్యంలోని 13,500 ఎకరాల ఆయకట్టును కూడా స్థిరీకరించేందుకు దోహదపడుతుంది. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలైన ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం దీనికి నిధులు కేటాయిస్తుందా.. లేదా? అని జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు.
- నేరడిగొండ మండలం కుప్టి గ్రామం వద్ద ప్రాజెక్ట్ నిర్మించాలని గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆలోచన చేసింది. 2018లో రూ.794 కోట్ల వ్యయంతో నిర్మించాలని అంచనా వేసినా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పలుసార్లు ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి అంచనా వ్యయాన్ని అధికారులు సవరిస్తూ వచ్చారు. తాజాగా ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.1,323 కోట్లకు చేరింది. త్వరలో నూతన ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ఈ అంచనా వ్యయం మరింత పెరగనుంది. 5.30 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఈ ప్రాజెక్ట్ నిర్మించనుండగా, కడెం ప్రాజెక్ట్ కింద స్థిరీకరణకు నోచుకోని 25,267 ఎకరాలను సస్యశ్యామలం చేసే ఉద్దేశంతో దీనిని నిర్మించతలపెట్టారు. అయితే ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అంతే కాకుండా ఇక్కడ నిర్మించే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా రానున్న రోజుల్లో బోథ్ నియోజకవర్గంలోని అనేక గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ పద్ధతిలో ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చనే ఆలోచన ఉంది. అలాగే కుంటాల జలపాతానికి ఏడాది పొడవునా నీటి కళ ఉండేలా ప్రణాళిక చేశారు.
- జిల్లా కేంద్రంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మధ్యలో ఈ పనులు వివిధ కారణాలతో ఆగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద ఈ ప్రాజెక్టుకు రూ.27 కోట్ల నిధులు రావాల్సి ఉంది. వాటికి సంబంధించి ఈ బడ్జెట్‌లో కేటాయింపులుంటాయని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

పొలాలకు రోడ్లు వేయాలి



వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు సరైన రోడ్లు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం అసెంబ్లీలో అనేకసార్లు ప్రస్తావించి ప్రతిపాదనలూ అందజేశాం. బీటీ రోడ్లకు మరమ్మతు చేయాలి. వానాకాలం కంటే ముందే లోతట్టు ప్రాంతాల వద్ద బ్రిడ్జీలు నిర్మించాలి. కొరాట–చనాకాకు నిధులు విడుదల చేసి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలి. సాత్నాల ఆయకట్టు కెనాల్ లైనింగ్ పనులు చేపట్టాలి. ఇందుకు నిధులు కేటాయించాలి.

– పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే

బడుల్లో వసతులు కల్పించాలి



గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బెడ్లు లేక పలు పాఠశాలల్లో కింద పడుకుంటున్నారు. నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించాలి. కేసీఆర్ సర్కారు ప్రారంభించిన అనేక పథకాలను ఈ ప్రభుత్వం విస్మరిస్తోంది. వాటిని పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలి.

– అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు

బడ్జెట్‌కు ముందు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే ప్రతిపాదనలు అందజేశారు. వాటికి బడ్జెట్‌లో మోక్షం లభిస్తుందని ఆశలు పెట్టుకున్నారు. అయితే జిల్లాలో ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ, బోథ్, ఆసిఫాబాద్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉండడంతో ఆయా నియోజకవర్గాల్లో కేటాయింపులపై సంబంధిత ఎమ్మెల్యేల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. అంతేకాకుండా స్వల్పంగా నిధులు కేటాయించినా అవి కూడా విడుదల చేయకపోవడంతో వారిలో నిరుత్సాహం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీల శాసనసభ్యులున్న నియోజకవర్గాల్లో కూడా అభివృద్ధి పనుల విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలనే అభిప్రాయం వారి నుంచి వ్యక్తమవుతోంది.

కలెక్టర్‌కు స్కోచ్ పురస్కారం



కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: కలెక్టర్ రాజర్షి షాకు స్కోచ్ అవార్డు లభించింది. ఈ మేరకు స్కోచ్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ దలాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 29న ఢిల్లీలోని లోధి రోడ్‌లో గల ఇండియా హ్యాబిటేట్ సెంటర్‌లో కలెక్టర్ ఈ అవార్డును అందుకోనున్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కలెక్టర్ గతేడాది నవంబర్ 14న ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉదయం ప్రార్థన సమయంలో ఆరోగ్య సంరక్షణకు అనుసరించాల్సిన విధానాలపై ఉపాధ్యాయులు, వైద్యుల ద్వారా వారికి అవగాహన కల్పించారు. ప్రతీ వారం మండలానికి రెండు పాఠశాలల చొప్పున గైడ్ టీచర్లు, స్టూడెంట్ లీడర్లతో కలెక్టరేట్‌లో సమీక్షించి వారంలో పాఠశాలలో జరిగిన మార్పులను తెలుసుకుని మరింత పకడ్బందీగా అమలు చేసేలా దిశానిర్దేశం చేశారు. కార్యక్రమ నిర్వహణతో విద్యార్థుల్లో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలో మార్పులు వచ్చాయి. కలెక్టర్‌కు ఈ అవార్డు రావడంపై పలువురు అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 'సీఎం ప్రజావాణి' అమలుపై సమీక్ష

కైలాస్‌నగర్: జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్న సీఎం ప్రజావాణి కార్యక్రమ నిర్వహణ తీరుపై కలెక్టర్ రాజర్షి మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, ఫిర్యాదుల పరిష్కార అధికారులు, ఐఎఫ్‌సీ డేటా ఎంట్రీ ఆపరేటర్లతో శిక్షణ, సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా అందిన దరఖాస్తులు.. వాటి డాటా ఎంట్రీ, పరిష్కారానికి చేపట్టిన చర్యలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. పైలెట్ ప్రజావాణిలో అందిన పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, ఆర్డీవో వినోద్‌కుమార్, తహసీల్దార్లు, ఉపాధిహామీ ఏపీవోలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

- కలెక్టర్ రాజర్షి షా
- అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. తాగునీటి కార్యాచరణ ప్రణాళిక, భూగర్భ జలాల పెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని చెప్పారు. పంపుహౌస్, బోర్‌వెల్స్, బావులు, మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మతు చేపట్టాలని సూచించారు. నీటి సంరక్షణ, పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో నీటి సమస్యను గుర్తించి వెంటనే నివేదిక అందించాలని తెలిపారు. ఆదిలాబాద్ రూరల్, ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, సిరికొండ, బజార్‌హత్నూర్ మండలాల్లోని సమస్యాత్మక హ్యాబిటేషన్లలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధిహామీ కింద ప్రతీ గ్రామీణ పేద కుటుంబానికి 100 రోజుల పని కల్పించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. వేసవిలో ఎండ తీవ్రత పెరుగుతున్నందున ఉదయం 6నుంచి 11గంటలలోపే పనులు పూర్తయ్యేలా చూడాలని పేర్కొన్నారు. వడదెబ్బ బారిన పడకుండా పని ప్రదేశంలో కూలీలు గంటకోసారి నీరు తాగేలా చూడాలని సూచించారు. వేసవికాలం ముగిసే దాకా కూలీలకు నీడ సౌకర్యం కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందుల కిట్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, డీఎల్పీవో ఫణీందర్‌రావు, గ్రౌండ్ వాటర్ ఏడీ శ్రీవల్లి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రమోహన్, ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఏఈలు, ఈసీలు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ వైద్యుల పోస్టుల నియామకానికి మంగళవారం డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఇంటర్వ్యూ నిర్వహించగా 33 మంది హాజరయ్యారు. సైకాలజీ విభాగంలో ప్రొఫెసర్ పోస్టుకు ఒకరు, అసిస్టెంట్ ప్రొఫెసర్, పాథాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్‌కు ఒక్కొక్కరు చొప్పున హాజరైనట్లు డైరెక్టర్ తెలిపారు. పీడియాట్రిక్ విభాగంలో ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు సీనియర్ రెసిడెంట్లు, ఆప్తాల్మిక్‌లో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నలుగురు ట్యూటర్లు, అనస్తీషియాలో ఒకరు అసోసియేట్, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, టీబీసీడీలో ఒక సీనియర్ రెసిడెంట్, రేడియాలజీ విభాగంలో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్థోలో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ హాజరైనట్లు పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మెడికల్ గ్యాస్ట్రాలజీలో ఒకరు అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్లాస్టిక్ సర్జరీలో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, మైక్రాలజీలో నలుగురు, జనరల్ మెడిసిన్‌లో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ హాజరైనట్లు వివరించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదం, జొన్నల కొనుగోళ్ల పరిమితి పెంచడాన్ని స్వాగతిస్తూ జిల్లా కేంద్రంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాసేవ భవన్‌లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత జీవితాల్లో వెలుగులు నింపేలా రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టును సాధిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారని పేర్కొన్నారు. ఇది జిల్లా అభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. నాయకులు భూపెల్లి శ్రీధర్, చరణ్‌గౌడ్, పవన్, శ్రీనివాస్, సతీశ్, నర్సింగ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

- మూడు గూడేలకు ఒకే చేతిపంపు
- సరఫరా కాని మిషన్ భగీరథ నీరు
- అధికారులకు పట్టని నీటి సమస్య
- గిరిజన బిడ్డలకు తప్పని నీళ్ల గోస

గుక్కెడు నీటికి అరిగోస



రెండు కిలో మీటర్లు కాలినడకన వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్న ఆదివాసీ గిరిజనులు



నీటి కోసం చేతిపంపు వద్ద నిరీక్షిస్తున్న సుంగాపూర్ గొండుగూడ గిరిజనులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజన గ్రామాలకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. దీంతో బిందెడు నీటి కోసం ఇప్పటికీ ఆదివాసీలు కాలినడకన కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. నీటి సమస్య ఉన్న గ్రామాల యువకులకు పిల్లనిచ్చేందుకు కూడా ఎవరూ ముందుకు రావడంలేదని ఆయా గ్రామాల గిరిజనులు ఆందోళన్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు సమస్య తెలిపినా పరిష్కరించడంలేదని ఆరోపిస్తున్నారు. ఓట్లప్పుడే హామీలు ఇస్తూ ఆ తర్వాత కనిపించడంలేదని వాపోతున్నారు. 40 ఏళ్లుగా నీటి కోసం అరిగోస పడుతున్నామని, ఇంకెన్నాళ్లు ఈ బాధలు పడాలని ప్రశ్నిస్తున్నారు. నార్నూర్ మండలం సుంగాపూర్ పంచాయతీ పరిధిలో మూడు అనుబంధ గ్రామాలైన లంబాడీతండా, కొలాంగూడ, గొండుగూడకు తాగునీటి సమస్య తెలుసుకునేందుకు 'సాక్షి' మంగళవారం వెళ్లింది. ఆయా గ్రామాల ప్రజలు తీవ్రమైన నీటి సమస్య ఎదుర్కొంటున్నట్లు పరిశీలనలో వెల్లడైంది.

గొండుగూడవాసుల గోస తీరేనా?

సుంగాపూర్ పంచాయతీ పరిధిలో 250 కుటుంబాలుండగా 1,500 మంది జనాభా ఉన్నారు. గొండుగూడలో 100 కుటుంబాలుండగా 400 జనాభా ఉంది. గొండుగూడలో గతేడాది ఐటీడీఏ ద్వారా బోరు వేసినా నీళ్లు అడుగంటాయి. మిషన్ భగీరథ నీరు సరఫరా అంతంతే. దీంతో బిందెడు నీటి కోసం ఉదయం 4గంటలకే చిన్నాపెద్దా లేచి రెండు కిలో మీటర్ల దూరం నడిచి చేతిపంపు, బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. కొందరు నీటి కోసం ఎడ్లబండిని వినియోగిస్తున్నారు. వేసవిలో వీరి బాధలు నిత్యకృత్యమయ్యాయంటే అతిశయోక్తి కాదు.

కొలాంగూడ కష్టాలు గట్టెక్కేనా?

కొలాంగూడలో 70 కొలాం గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయి. పీటీజీల సంక్షేమానికి ప్రభుత్వాలు నిధులు కేటాయించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా అధికారుల నిర్లక్ష్యం వారికి శాపంగా మారుతోంది. మిషన్ భగీరథ నీళ్లు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. నాలుగు దశాబ్దాలుగా గ్రామంలోని ఏకైక చేతిపంపు నీటితోనే మూడు గూడేల ప్రజలు దాహం తీర్చుకుంటున్నారు.

లంబాడీతండా.. సమస్యల అడ్డా


లంబాడీ తండాలో 100 గిరిజన కుటుంబాలుండగా, 400కు పైగా జనాభా ఉంది. గ్రామంలో మిషన్ భగీరథ నీళ్ల ట్యాంకున్నా ఉపయోగం లేదు. చేతిలో బిందెలు పట్టుకుని కొలాంగూడకు లేదా సమీపంలోని బావి వద్దకు వెళ్లాల్సిన దుస్థితి. గ్రామంలో ఎలాంటి నీటి సౌకర్యం లేదు. వేసవి ప్రారంభంలోనే గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు.

పరిష్కారం చూపుతాం

సుంగాపూర్‌లో నీటి సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం. సమస్యను ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. ప్రతిపాదనలు కూడా పంపించాం. నిధుల మంజూరు కోసం ఎదురుచూస్తున్నం. త్వరలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం.

– రోడ్డ శ్రీనివాస్, డీఈఈ, ఉట్నూర్


మా ఊరికి పిల్లనిస్తలేరు



మాకు నీళ్లతో బాగా గోసైతంది. ఎండాకాలం నీటి కోసం బిందెలతో రెండు కిలో మీటర్లు నడుస్తున్నం. నీళ్ల గోస ఉందని మా ఊరి పోరగాళ్లకు పిల్లనిచ్చేందుకు ఎవ్వరూ ముందుకు వస్తలేరు. మా గోస ఎవరూ పట్టించుకుంటలేరు. పెద్దసార్లు జెర మా సమస్య పరిష్కరించాలె.

– పూర్ణబాయి, సుంగాపూర్ గొండుగూడ


నీళ్ల సౌలత్ కల్పించాలె



పొద్దున 4గంటలకే లేస్తున్నం. నీళ్ల కోసం నెత్తిన బిందెలతో చిన్నాపెద్ద అంతా కలిసి రెండు కిలో మీటర్ల దూరంలోని చేతిపంపు వద్దకు లేదా బావి వద్దకు వెళ్తున్నం. అక్కడ గంటల కొద్దీ నిల్చుంటున్నం. నీళ్ల కోసం మేము పడుతున్న ఇబ్బంది ఎవరికీ రావద్దు. అధికారులు నీళ్ల సౌలత్ కల్పించాలె.

– రేణుకాబాయి, సుంగాపూర్ గొండుగూడ

వాగుపై చెరువు నిర్మించాలె



మా ఊరిలో ఎక్కడ బోరు వేసినా నీళ్లు పడ్తలేవు. తాగునీటికి నిత్యం తండ్లాడుతున్నం. సుంగాపూర్ గ్రామ సమీపంలోని వాగుపై చెరువు నిర్మించాలె. అప్పుడే భూగర్భ జలాలు పెరుగుతయ్. కలెక్టర్, ఐటీడీఏ పీవో పట్టించుకోవాలె. మా నీటి గోస వెంటనే తీర్చి ఆదుకోవాలె.

– మాడవి లచ్చుపటేల్, గొండుగూడ

ముగిసిన అధికారుల మధ్య వివాదం

నేరడిగొండ: కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో రైతులు సాగు చేస్తున్న పంట పొలాల్లో విద్యుత్ వైర్లు వేశారని అటవీశాఖ అధికారులు సంబంధిత ఏఈ నాగేంద్రప్రసాద్‌కు నోటీసులు అందజేశారు. ఆయన ఇచ్చిన నోటీసులకు సమాధానం తెలుపకపోవడంతో సిరిచెల్మ కవ్వాల్‌టైగర్ జోన్ ఎఫ్ఆర్వో నాగావత్ స్వామి, కుంటాల డిప్యూటీ రేంజ్ అధికారి లఖన్ సింగ్, అటవీ అధికారులు మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి మంగళవారం చేరుకున్నారు. అక్కడున్న ఏఈ నాగేంద్రప్రసాద్‌ను అరెస్ట్ చేస్తామని చెప్పారు. దీంతో అక్కడే ఉన్న విద్యుత్ శాఖ చీఫ్ ఇంజినీర్ జైవంత్‌రావు చౌహాన్ డీఎఫ్‌వో ప్రశాంత్ పాటిల్‌తో ఫోన్‌లో మాట్లాడి రెండు రోజుల సమయం ఇస్తే వైర్లు, స్తంభాలు తొలగిస్తామని చెప్పగా వారి మధ్య వివాదం సద్దుమణిగింది.

క్లుప్తంగా

దాడి చేసిన వ్యక్తిపై కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనికి చెందిన కొత్తగట్టు శ్రీనివాస్‌పై దాడి చేసిన శ్రీరాముల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. కొత్తగట్టు పద్మ, శ్రీరాముల శ్రీనివాస్ వరుసకు అక్కా,తమ్ముడు అవుతారు. ఇద్దరికీ కలిసి ఏసీసీ సమీపంలో ఒక ఇల్లు ఉంది. పద్మకు తెలియకుండా గోడ నిర్మాణం చేశాడు. దీనికి అయిన ఖర్చులో సగం ఇవ్వాలని ఈ నెల11న శ్రీనివాస్ పద్మపై దాడి చేసేందుకు యత్నించగా అడ్డుకున్న ఆమె భర్త శ్రీనివాస్‌పై కుర్చితో దాడి చేసి గాయపరిచాడు. మంగళవారం పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీరాముల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్షతో పాటు అప్పుగా తీసుకున్న రూ.12 లక్షలు చెల్లించాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, ఫస్ట్‌క్లాస్ జుడీషియల్ మేజిస్ట్రేట్ కే.నిరోష మంగళవారం తీర్పునిచ్చారు. మంచిర్యాలకు చెందిన గుమ్మి జగన్నాథ్‌రెడ్డి వద్ద స్థానిక రెడ్డికాలనీకి చెందిన తోట రామకృష్ణారెడ్డి తన అవసరం నిమిత్తం రూ.12 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సమయంలో ష్యూరిటీగా చెక్కు అందజేశాడు. అప్పు తీసుకున్న గడువు తీరిన తర్వాత సదరు చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యింది. దీంతో 2017లో జగన్నాథ్‌రెడ్డి కోర్టును ఆశ్రయించగా విచారణ అనంతరం న్యాయమూర్తి నిరోష ఏడాది జైలుశిక్షతో పాటు తీసుకున్న అప్పు చెల్లించాలని తీర్పునిచ్చారు.

చోరీ కేసులో ఒకరికి జైలుశిక్ష

లక్సెట్టిపేట: చోరీ కేసులో ఒకరికి మూడు నెలల తొమ్మిది రోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన గంగాధర్ విట్టల్ గైక్వాడ్ 2024 అక్టోబర్ 27న పట్టణంలోని ఆంధ్రాకాలనీలోని రెండిళ్లలో చోరీకి పాల్పడ్డాడు. ఇళ్ల తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.50వేల నగదు, ఇత్తడి సామగ్రి దొంగిలించాడు. బాధిత మహిళ లక్ష్మి ఫిర్యాదు మేరకు అదనపు ఎస్సై రామయ్య కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నేరం రుజువు కావడంతో స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మంగళవారం పైవిధంగా తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు




గాయాలపాలైన ఖాదీర్, సత్యనారాయణ

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఖాదీర్, కుభీర్ మండలానికి చెందిన సత్యనారాయణ మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఖానాపూర్ వైపు నుండి నిర్మల్ వెళ్తుండగా నిర్మల్ నుండి కనకాపూర్ వైపు వస్తున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో ఖాదీర్, సత్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

పిచ్చుకలతో జీవ వైవిధ్యం

- రేపు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



నస్పూర్: పిచ్చుకల సంరక్షణతోనే జీవ వైవిధ్యం కొనసాగుతుందని నేటి ఆధునిక సమాజంలో ఎంత మందికి తెలుసు. ఈ భూగోళంపై నివసించే ప్రతీ జీవి, మానవునితో పాటు సకల ప్రాణుల మనుగడకు, జీవవైవిధ్యానికి, ఆహార ఉత్పత్తికి సైతం పిచ్చుకల పరపరాగ సంపర్కమే కారణం. కనుమరుగవుతున్న కమనీయ పిచ్చుకల జాతులను కాపాడుకోకుంటే తీరని నష్టం వాటిల్లుతుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. పంట చేలల్లో, పల్లె ముంగిట్లో ధాన్యపు రాశుల్లో కిలకిల మంటూ సందడి చేసే పిచ్చుకలు మానవుడు పెంచుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానంతో వాటి మనుగడకు శాపంగా మారిందని సెల్ తరంగాల రేడియేషన్, కాలుష్యం కారణంగా ఇవి ప్రకృతి నుండి కనుమరుగవుతున్నాయని పర్యావరణ వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



యోగేశ్వర్ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన పిచ్చుక గూళ్లు

తల్లి ప్రేమకు నిదర్శనం

జనావాసాలతో మమేకమై జీవిస్తున్న పిచ్చుకలు మెత్తని పీచు వంటి వాటితో గూడు కట్టుకోవడం, అందులో గుడ్లు పెట్టడం, వాటిపై పొదగడం, పుట్టిన పిల్లలకు ఆహారాన్ని నోటితో తెచ్చి అందించడం, వాటికి రెక్కలొచ్చి ఎగిరేంత వరకు జాగ్రత్తగా కాపాడడం వంటి దృశ్యాలు తల్లి ప్రేమకు నిదర్శనంగా నిలుస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ఆదర్శవంతమైన పిచ్చుకల అన్యోన్యతను, తల్లి ప్రేమకు మరోపేరుగా గుర్తించిన ప్రపంచ దేశాలు పిచ్చుకల సంరక్షణపై అవగాహన కల్పించడానికి ప్రతీ సంవత్సరం మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నాయి. పిచ్చుకల ప్రాధాన్యతను గుర్తించిన భారత ప్రభుత్వం తపాలా బిల్లును సైతం విడుదల చేసిందని పర్యావరణ వేత్తలు గుర్తు చేస్తున్నారు.

పిచ్చుకలను బతుకనిద్దాం

పిచ్చుకల మనుగడకు ప్రమాదం ఏర్పడితే మానవ మనుగడపై తీవ్ర ప్రమాదం ఏర్పడుతుంది. పిచ్చుకల సంరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత. వాటి ఆవాసం కోసం ఇంటి ఆవరణలో వెదురు, కర్ర, అట్టడబ్బాలతో గూళ్లు తయారు చేయాలి. మట్టిపాత్రలో నీరు, ధాన్యపు గింజలు పోసి ఉంచాలి. ఇంటి ముందు రసాయనాలు లేని బియ్యపు పిండి ముగ్గు వేస్తే వాటికి ఆహారంగా ఉపయోగపడుతుంది. పిచ్చుకలు పదికాలాల పాటు పదిలంగా బతికేలా మానవులుగా మనవంతుగా సహకరిద్దాం.. పిచ్చుకలను బతుకనిద్దాం. పర్యావరణాన్ని కాపాడుదాం.

– గుండేటి యోగేశ్వర్, పర్యావరణ వేత్త, రిటైర్డ్ టీచర్, నస్పూర్

కొలిక్కిరాని హమాలీల వివాదం

- రెండో రోజూ జైనథ్‌లో నిలిచిన శనగ కొనుగోళ్లు



మార్కెట్ యార్డులో ఆందోళనకు దిగిన రైతులు

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీల వివాదం ఎటూ తేలలేదు. రెండోరోజు మార్కెట్ యార్డులో శనగ కొనుగోళ్లు జరగలేదు. బుధవారం సైతం ప్రారంభమయ్యేలా కన్పించడం లేదు. ఇద్దరు గుత్తేదారుల మధ్య నెలకొన్న లొల్లి రైతుల పాలిట శాపంగా మారింది. ఆందోళనను సద్దుమణిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి ముగ్గురు అధికారులతో కూడిన బృందాన్ని జైనథ్ మార్కెట్‌యార్డుకు పంపించింది. సదరు అధికారులు దీనిపై ఎటూ తేల్చకుండానే వెనుదిరిగారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వారు ఎవరికి ఏమి చెప్పే పరిస్థితి లేకపోవడంతో చేసేదేమి లేక ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని అక్కడి నుంచి వెనుదిరిగారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ ఏడీ గజానంద్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, డీసీవో మోహన్‌లు మార్కెట్ కార్యదర్శి దేవన్నకు సూచించారు. అక్కడున్న కాంటాల్లో ఇద్దరు గుత్తేదారులకు చెరిసగం చూసుకోవాలని సూచించినట్లుగా తెలుస్తోంది. అయితే సదరు గుత్తేదార్లు దీనిపై అంగీకరించేందుకు ముందుకు రాలేదు. జైనథ్ వ్యవసాయ మార్కెట్ అధికారులు కొత్త గుత్తేదారుకు లైసెన్స్ ఇచ్చినట్లుగా సమాచారం. ఆయనకే హమాలీల బాధ్యతలను పూర్తిస్థాయిలో కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే గత 15ఏళ్లుగా బిహార్‌కు చెందిన గుత్తేదారే హమాలీలను సరఫరా చేస్తున్నారు. తాను ఎలాంటి తప్పు చేయకున్నా ఉన్నఫలంగా తనను ఏ విధంగా తొలగిస్తారని వాపోతున్నారు. ఇద్దరు గుత్తేదార్లను పిలిచి నచ్చజెప్పినప్పటికి వారి మధ్య సయోధ్య కుదరలేదు. శనగ పంటను విక్రయించేందుకు తీసుకొచ్చిన రైతులు కొనుగోళ్లు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీ కాంట్రాక్టర్ల లొల్లి కారణంగా తమను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు పేర్కొన్నారు.

నా బిడ్డను మా అమ్మకు అప్పగించండి..!

- నా చావుకు భార్య, అత్తమామలే కారణం
- సెల్ఫీ వీడియోలో వెల్లడి
- యువకుడి ఆత్మహత్య



అంజన్న (ఫైల్)

దండేపల్లి: 'నా చావుకు భార్య, అత్తమామలే కారణం.. నా బిడ్డను మా అమ్మకు అప్పగించండి..' అంటూ ఓ యువకుడు సెల్ఫీ వీడియోలో పేర్కొంటూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని వెల్గనూర్ గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కాంద్రపు అంజన్న(26) కాసిపేటకు చెందిన శిరీషను రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి వారం రోజుల క్రితం కూతురు జన్మించింది. దీంతో సోమవారం కూతురిని చూడడానికి అంజన్న కాసిపేటకు వెళ్లగా.. భార్య, అత్తమామలు దూషించారు. దీంతో ఆవేదనకు గురైన అంజన్న ఇంటికి వచ్చి సెల్ఫీ వీడియో తీసుకుంటూ తన ఆత్మహత్యకు కారకులు అంటూ భార్య, అత్తమామలు, పెద్దమనుషులు పలువురి పేర్లు పేర్కొన్నాడు. రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య



రాకేశ్ (ఫైల్)

జైపూర్: ఖాళీగా ఉండకుండా ఏదైనా పని చేసుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లాలోని శివ్వారంలో చోటు చేసుకుంది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల మేరకు శివ్వారం గ్రామానికి చెందిన గెల్లు పోశక్క, దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు రాకేశ్ (26) డిగ్రీ పూర్తి చేశాడు. కొంతకాలం ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసి మానేశాడు. కొద్దిరోజులుగా ఇంటివద్దే ఉంటున్నాడు. దీంతో అతని తల్లిదండ్రులు ఏదైనా పని చేసుకోవాలని, లేదా వ్యవసాయం చూసుకోవాలని చెప్పడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం పంట పొలం వద్దకు వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



కరణ్‌సింగ్ (ఫైల్)

నిర్మల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌నగర్ కాలనీకి చెందిన చవాన్ కరణ్‌సింగ్ (22) మంగళవారం అదే కాలనీకి చెందిన స్నేహితులు సయ్యద్ అజీమ్, నర్సింగ్‌తో కలిసి బైక్‌పై సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జిల్లా కేంద్రంలోని గండి రామన్న ఆలయ సమీపంలోకి రాగానే టిప్పర్‌ను ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి ముగ్గురూ కిందపడిపోయారు. కరణ్‌సింగ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సయ్యద్ అజీమ్, నర్సింగ్‌ను 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చేపల వల చుట్టుకుని మత్స్యకారుడు..



సాయికుమార్ మృతదేహం

సోన్: చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపి తెలిపిన వివరాల మేరకు మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన సస్కిన్ సాయికుమార్ (28) మంగళవారం వృత్తిరీత్యా చేపలు పట్టేందుకు సరస్వతి కెనాల్‌కు వెళ్లాడు. కాలువలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఉట్నూర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం జైనూర్ మండలానికి చెందిన కుమ్ర భక్కు (46) మంగళవారం ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి సమీపంలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొన్నాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై వస్తుండగా మారుతిగూడ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన మరో బైక్‌ను ఢీకొట్టాడు. ఘటనలో భక్కుకు తీవ్రగాయాలు కావడంతో అటుగా వెళ్తున్న మాజీ ఎంపీపీ గమనించి 108కు సమాచారం అందించగా ముందుగా ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఘటనపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా కొఠారి గ్రామానికి చెందిన రాథోడ్ జాముబాయి (55) మృతి చెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఈనెల 16న రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు.

చోరీ కేసులో మహిళ రిమాండ్

లక్సెట్టిపేట: ఈనెల 16న పట్టణంలోని గోదావరి రోడ్‌లో నివాసముంటున్న కొత్త శ్యామల ఇంట్లో చోరీకి పాల్పడిన వసంత అనే మహిళను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. అదే కాలనీకి చెందిన వసంత బాధితురాలు శ్యామల ఇంట్లో ఎవరూలేని సమయంలో చొరబడి ఆమెను బాత్‌రూంలోకి నెట్టివేసి మెడలోని గొలుసు లాక్కుని పారిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి గొలుసును స్వాధీనం చేసుకున్నారు. సదరు మహిళను సోమవారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం పరిశీలిస్తున్న ఎస్సై రాహుల్

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో కడమంచి లక్ష్మణ్ నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. నిరుపేద ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు ఇంటి వెనకాల ప్రహరీ వద్ద నిలువ ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

కర్బూజ సాగు..లాభాలు బాగు

- జిల్లా వ్యాప్తంగా 70 ఎకరాల్లో సాగు
- అధిక దిగుబడులు సాధిస్తున్న రైతులు
- వేసవిలో పంటకు డిమాండ్

చెన్నూర్‌రూరల్: పంట మార్పిడి విధానం అవలంభిస్తే అధిక లాభాలు ఉంటాయి. ఎల్లప్పుడూ ఒకే రకం పంటలు సాగుచేస్తే భూసారం దెబ్బతింటుంది. వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు రైతులు పంట మార్పిడికి ముందుకు వస్తున్నారు. ఇందుకు ఉదాహరణ కర్బూజ సాగు. ఇతర పంటలు సాగు చేసి విసిగి పోయిన కొందరు రైతులు ఇందుకు భిన్నంగా ఆలోచించి వేసవిలో కర్బూజ సాగు వైపు దృష్టి సారించారు. వేసవిలో మార్కెట్‌లో కర్బూజకు మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో ఈ పంట వైపు దృష్టి పెట్టారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 70 ఎకరాల్లో కర్బూజ పంట సాగవుతోంది. జిల్లాలోని చెన్నూర్, భీమారం, బెల్లంపల్లి, దండేపల్లి, కోటపల్లి, వేమనపల్లి, భీమిని, కన్నెపల్లి మండలాల్లో పంట సాగు చేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.20 వేల నుండి రూ.25 వేల వరకు పెట్టుబడులు అవుతాయి. నవంబర్, డిసెంబర్ నెలలు సాగుకు అనుకూలం. గింజలు నాటిన సమయం నుంచి మూడు నెలల వరకు పంట కాపుకు వస్తుంది. ఎకరాకు సుమారు 12 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కిలోకు రూ.12 నుండి 15వరకు ధర పలుకుతుంది. ఎకరానికి సుమారు రూ.60 వేల నుంచి 70వేల వరకు లాభం వస్తుంది. స్వయంగా అమ్మితే లాభం మరింత ఎక్కువగా ఉంటుంది.



ఒతుకులపల్లిలో సాగుచేసిన కర్బూజ పంట

చీడపీడల నివారణకు చర్యలు

ఈ పంటను కాయ తొలుచు పురుగు (పండు ఈగ) ఎక్కువగా ఆశిస్తుంది. దీని యొక్క లార్వాలు కాయలోకి చొచ్చుకు పోయి కుళ్లి పోయేలా చేస్తాయి. పురుగు ఆశించక ముందే 10 లీటర్ల నీటిలో 100 ఎంఎల్ మలాథియన్, 100 గ్రాముల బెల్లం కలిపి వెడల్పాటి పల్లెంలో ఈ ద్రావణం పోసి పంట చేనులో అక్కడక్కడ ఉంచాలి. పురుగు ఆశించిన తర్వాత నివారణకు వెంటనే లీటరు నీటికి 2ఎంఎల్ మలాథియన్ లేదా 2 ఎంఎల్ క్లోరిఫైరిపాస్ పిచికారీ చేయాలి. అలాగే తెల్లదోమ నివారణకు జిగురు కలిగిన పసుపు రంగు అట్టలను చేనులో ఏర్పాటు చేసుకోవాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 3ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్ లేదా 2 గ్రాముల ఎస్టమిప్రైడ్ కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగు ఆశిస్తే లీటరు నీటికి 2 గ్రాముల పిప్రోనిల్ కలిపి పిచికారీ చేయాలి.

మంచి లాభాలు ఉన్నాయి



వరి, పత్తి పంటల సాగుకు భిన్నంగా వేరే రకం పంటలు సాగు చేయాలని అనుకున్నా. మూడేళ్లుగా రెండెకరాల భూమిలో కర్బూజ సాగు చేస్తున్నా. మంచి లాభాలు ఉన్నాయి. వేసవిలో పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

– కంకణాల లక్ష్మణ్‌రెడ్డి, కర్బూజ రైతు, ఒతుకులపల్లి

సలహాలు, సూచనలు ఇస్తున్నాం



కర్బూజ సాగులో మంచి లాభాలు ఉన్నాయి. రైతులు ముందుకు వచ్చి ఇలాంటి పంటలు సాగు చేసి అధిక లాభాలు గడించాలి. నియోజకవర్గ వ్యాప్తంగా కర్బూజ సాగు చేస్తున్న రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

– బానోతు ప్రసాద్, ఏడీఏ, చెన్నూర్


నేషనల్ మార్ట్‌లో చోరీ



సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని నేషనల్ మార్ట్‌లో చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. రోజు మాదిరిగానే నేషనల్ మార్ట్ సిబ్బంది సోమవారం రాత్రి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం వచ్చేసరికి సేఫ్టీలాకర్ ఓపెన్ అయి ఉండడంతో మేనేజర్ తుకారాం పోలీసులకు సమాచారం అందించాడు. లాకర్‌లో ఉన్న రూ.4.82 లక్షలు చోరీకి గురయ్యాయని మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. సీసీ ఫుటేజీలో రికార్డయిన లాకర్ ఓపెన్ చేస్తున్న దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఐటీడీఏ పీవోకు స్కోచ్ అవార్డు



ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా గిరిజనులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు. విధుల్లో చేరినప్పటి నుంచి గిరిజనులకు చేరువ కావడంతో పాటు గిరిజన విద్యార్థుల్లో పౌష్టికాహార నివారణకు రాష్ట్రంలో మొదటిసారిగా గిరిజన పోషణ మిత్ర, స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు గిరిజన క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడంలో పీవో ముందు వరుసలో నిలిచారు. ఈ నెల 29న న్యూఢిల్లీలో ఇండియా హబిటాట్ సెంటర్‌లోని జకరంద హాల్‌లో ఐటీడీఏ పీవో అవార్డు అందుకోనున్నారు.

గిన్నిస్ రికార్డులో స్థానం జిల్లాకే గర్వకారణం



గుస్సాడీ బృందంతో కుమురంభీం జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ఆదివాసీ గిరిజనుల సంప్రదాయమైన గుస్సాడీ నృత్య ప్రదర్శన గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించుకోవడం జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తిర్యాణి మండలం దంతన్‌పల్లి గ్రామానికి చెందిన భీమయ్య కొలాం గుస్సాడీ బృందంతో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, గిరిజన సంఘాల నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఢిల్లీలో 5 వేల మంది కళాకారులతో నిర్వహించిన కార్యక్రమంలో దంతన్‌పల్లి పీవీటీజీ కొలాం గుస్సాడీ బృందం నృత్య ప్రదర్శన రికార్డు సృష్టించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో స్థానం సంపాదించిందన్నారు. గిరిజనుల ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. అనంతరం గుస్సాడీ బృంద సభ్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు సిడాం అర్జు, ఆత్రం గంగారాం, మడావి భీమ్‌రావు, కుర్సింగ మోతీరాం, ఆత్రం సంతోశ్, చహకటి దసరు, తదితరులు పాల్గొన్నారు.

గనుల వేలంలో సింగరేణి పాల్గొనాలి



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

కాసిపేట: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న మోసపూరిత కుట్రను రద్దుచేసి సింగరేణి టెండర్లలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి, ఇల్లందు మైన్‌లకు సింగరేణి టెండర్‌లలో పాల్గొనవద్దని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెప్పడం జరిగిందన్నారు. తిరిగి అదే ప్రభుత్వం సింగరేణికి టెండర్ ఇవ్వకుండా ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి టెండర్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె చేసి హక్కులు సాధించుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, గని ఫిట్ సెక్రెటరీ మినుగు లక్ష్మీనారాయణ, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, నాయకులు నాగేశ్వరరావు, శ్రీహరి, రాజేందర్, సురేశ్, సంతోష్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

22న ట్రిపుల్ ఐటీలో ఎస్‌డీజీ సమ్మిట్

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని ఆర్జీయూకేటీ (ట్రిపుల్ ఐటీ)లో ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా ఈనెల 22న ఎస్‌డీజీ సమ్మిట్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు, కార్యాచరణ పరిష్కారాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ సమ్మిట్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వర్సిటీ విద్యార్థి జావేద్ నేతృత్వంలోని టీమ్ ట్రాన్స్‌ఫార్మ్ ఈ సమ్మిట్ నిర్వహిస్తుందన్నారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి సహకార చర్య, వినూత్న పరిష్కారాల ప్రాముఖ్యతను ప్రొఫెసర్ గోవర్ధన్ నొక్కి చెప్పారు. ఈ సమ్మిట్ థీమ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల జీవితాల్లో అర్థవంతమైన మార్పు తీసుకురావడానికి సంస్థ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. అనంతరం సమ్మిట్ లోగోను విడుదల చేశారు. ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీ దర్శన్, ఏవో రణధీర్ సాగి పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న వీసీ గోవర్ధన్